ఐటీ భద్రత మేటి

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..



మాదాపూర్: ఐటీ ప్రాంతం భద్రతాపరంగా మేటిగా ఉందని, శాంతి భద్రతలను కాపాడేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మాదాపూర్ సీఐ. ఎస్ తిరుపతి పేర్కొన్నారు. మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 7 సెక్టార్లు ఉండగా నెలకోసారి హాస్టల్స్, హోటల్స్ నిర్వాహకులకు నిబంధనలను తెలియజేస్తున్నామన్నారు. మాదాపూర్ ప్రాంతం ఐటీ హబ్ కావడంతో ఎపుడు రద్దీగా ఉంటుందని ఈ ప్రాంతంలో తాము తీసుకుంటున్న రక్షణ చర్యల గురించి సీఐ తిరుపతి సాక్షితో మాట్లాడారు.. ప్రతి రోజు వాహన తనిఖీలు, పాత నేరస్తులపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. దీపావళి, గణేశ్ ఉత్సవం, రంజాన్ పండగల సమయంలో యజమానులు, ఆయా కాలనీల అసోసియేషన్ సభ్యులతో సమావేశాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

1. మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్లు ఉన్నాయి.?

జ: మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 7 సెక్టార్లు ఉన్నాయి. ఎస్సైలు 11 మంది, కానిస్టేబుల్స్ 85 మంది, హెడ్ కానిస్టేబుల్స్ 12 మంది, పెట్రోలింగ్ 2, ఐటీ మొబైల్ 2 ఉన్నాయి.


మాదాపూర్ సీఐ తిరుపతి

2. మీ పీఎస్ పరిధిలో ఎన్ని సీసీ కెమెరాలు ఉన్నాయి.?

జ: ఐటీ ప్రాంతం కావడంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సీసీ కెమెరాలను అమర్చాము. ప్రధాన కూడళ్లలో నాలుగు వైపులా పూర్తిగా సమాచారం తెలుసుకునే విధంగా 7 సెక్టార్‌లలో మొత్తం 5,057 కెమెరాలు ఉన్నాయి. వీటి ద్వారానే చాలా కేసులు పరిష్కరించాం.

3. పండగల సమయంలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ?

జ: పండగ సమయాలలోనే కాకుండా ముఖ్యమైన రోజులలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. గణేశ్ ఉత్సవాల ట్రాఫిక్ ఆంక్షలు, విగ్రహాలను ప్రతిష్ఠించే సమయంలో తీసుకోవాలన్సిన జాగ్రత్తలు, నిమజ్జనం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తాము.

సెక్టార్లు	ఎస్సైలు	ఫోన్ నంబర్లు
సెక్టార్ -1 ,	ఎస్. వెంకన్న	ఫోన్ 8712663107
సెక్టార్-2 ,	కె.హారిక	ఫోన్: 9553732327
సెక్టార్-3,	ఎస్.భాస్కర్	ఫోన్: 8712663101
సెక్టార్-4,	వై.సుఖేందర్‌రెడ్డి	ఫోన్: 8712663104
సెక్టార్-5,	వి.మాల్యానాయక్	ఫోన్: 7901115159
సెక్టార్-6,	అవినాష్‌బాబు	ఫోన్: 7901117308
సెక్టార్ -7,	ఎ.దీక్షిత	ఫోన్ : 8712663119

4. నెలకు ఎన్నిసార్లు వాహనాల తనిఖీలు నిర్వహిస్తారు ?

జ: ప్రతి రోజు ప్రధాన కూడళ్లలో వాహనాలను తనిఖీ చేస్తాం. అనుమానం వచ్చిన వారి పూర్తి వివరాలను తెలుసుకుంటాం. ఏమైన పాత కేసులు ఉంటే వారిని ఎక్కువగా విచారిస్తాం. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తాం. ప్రతి ఒక్కరు వాహనాలను నడిపే సమయంలో పత్రాలను దగ్గర ఉంచుకుని హెల్మెట్‌లను తప్పనిసరిగా వాడాలి. లేదంటే ఫైన్లు తప్పవు.

◆ మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అపరిచితుల సంచారం, ఎవరిపైనైనా అనుమానం వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

శేరిలింగంపల్లిలో అభివృద్ధి శూన్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో అభివృద్ధి శూన్యమని, బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు విమర్శించారు. శేరిలింగంపల్లి గోపీనగర్‌లో శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజా గోస-బీజేపీ భరోసా పేరిట చేపట్టిన కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదన్నారు. చెరువుల సుందరీకరణ పేరుతో ఎమ్మెల్యే అనుచరులు కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. కార్నర్ మీటింగ్‌ల ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని ప్రజలకు వివరిస్తామన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు తదితరులు

అసెంబ్లీ కన్వీనర్ రాఘవేందర్‌రావు, బీజేపీ నాయకులు రవికుమార్‌యాదవ్, గజ్జెల యోగానంద్, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజుశెట్టి, ఎల్లేష్, చంద్రమోహన్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు ఇవ్వాలి : సీపీఐ ధర్నా


శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, బస్తీవాసులు

శేరిలింగంపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అలాగే వదిలేశారని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో బస్తీవాసులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా తహశీల్దార్ కార్యాలయం అధికారులు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. కబ్జాలకు గురైన భూములను వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అర్హులైన వారికి డబుల్ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు స్థలం ఉన్న వారికి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, పార్టీ జిల్లా సమితి నాయకులు చందుయాదవ్, వెంకటస్వామి, ఖాసీం, శ్రీను, వెంకటేష్, లింగం పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వజ్రం అపార్ట్‌మెంట్స్, ఎన్ వీడియా, నానక్‌రాంగూడ, ప్రైమ్ అపార్ట్‌మెంట్స్, ఐఐఆర్‌ఎం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్స్, ది శ్రీరాం స్కూల్, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్‌హిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: చందానగర్ సబ్‌స్టేషన్ పరిధి హుడాకాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ ప్రాంతంలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఉమారాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హుడాకాలనీ మొత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

శాంతినగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

శాంతినగర్‌లోని 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో..మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతినగర్, చందానగర్ ప్రధానరోడ్డు ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో 'రీ ఆర్గనైజింగ్ ది మెంటల్ స్పేస్' అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ బి.కె. రామకృష్ణ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

శ్రీశైలంకు సూపర్ లగ్జరీ బస్సులు

మియాపూర్ : మహా శివరాత్రి పండగను పురస్కరించుకుని శ్రీశైలానికి వెళ్లే ప్రయాణికుల కోసం మియాపూర్ ఆర్టీసీ మియాపూర్ డిపో-1 నుండి సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నామని మేనేజర్ రామయ్య తెలిపారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నగరం నుండి శ్రీశైలంకు వెళ్లే భక్తులకు మియాపూర్ ఎక్స్ రోడ్డు నుండి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. రాత్రి 9 గంటల నుండి 11 గంటల వరకు ప్రతి 30 నిమిషాలకొకసారి బస్సు నడుపుతున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9959226153లో సంప్రదించాలని తెలిపారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బండారి లేఅవుట్‌లోని దక్షిణాభిముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ విజయలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చతుస్థానార్చనలు, వాస్తు హోమం, పుష్పాదివాసం కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్పొరేటర్ జ్యోతి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారాజు, సెక్రటరీ రవీంద్రబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కిషోర్, సభ్యులు వెంకన్న, మూర్తి, నగేష్, బాలరాజు, శివ, ఉమాశంకర్, శేషయ్య, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెస్‌లో విఘ్నేష్ ప్రతిభ



మియాపూర్: జాతీయస్థాయి చెస్ పోటీల్లో మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ కాలనీలోని క్లియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి విఘ్నేష్ ప్రతిభ చాటాడు. తమిళనాడు హోసూరులో ఆలిండియా చెస్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో అండర్-15 విభాగంలో విఘ్నేష్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రావూస్ గ్రూపు విద్యా సంస్థల అధినేత ప్రభాకర్‌రావు విఘ్నేష్‌ను సన్మానించారు. సీఈఓ నితిన్‌రావు, అకడమిక్ డైరెక్టర్ శశిరేఖ, కో ఆర్డినేటర్ విజయలక్ష్మీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

33 కోట్ల మంది హెల్త్ అకౌంట్లు సిద్ధం

- త్వరలో యూహెచ్‌ఐని ప్రారంభించనున్న ప్రధాన మంత్రి
- ఆరోగ్య రంగంలో టెక్నాలజీ వినియోగం పెరిగింది
- నేషనల్ హెల్త్ అథారిటీ మాజీ సీఈఓ డాక్టర్ ఆర్‌ఎస్ శర్మ
- ఐఎస్‌బీలో హెల్త్‌కేర్ 4.0 వార్షిక సదస్సు నిర్వహణ



రాయదుర్గం: భారతదేశ వ్యాప్తంగా 33 కోట్ల మంది హెల్త్ అకౌంట్లను ఏర్పాటు చేయడం జరిగిందని నేషనల్ హెల్త్ అథారిటీ మాజీ సీఈఓ డాక్టర్ ఆర్ ఎస్ శర్మ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఐఎస్‌బీ మ్యాక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌బీ-ఎంఐహెచ్‌ఎం) ఆధ్వర్యంలో ఐఎస్‌బీ హెల్త్ కేర్ 4.0 పేరిట ప్రత్యేక సదస్సును ఐఎస్‌బీలోని ఖేమ్కా ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. ప్రారంభ సమావేశంలో ముఖ్య వక్తగా ఆయన విచ్చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డును తయారు చేస్తారని, సాంకేతిక వినియోగం ద్వారా ఆరోగ్య రంగంలో ఎన్నో విజయాలు సాధించేందుకు అవకాశం కలిగిందన్నారు. త్వరలో ఆరోగ్యం రంగంలో అన్ని సేవలను ఒక్కచోట లభించేలా చేయడం కోసం యూనిఫైడ్ హెల్త్ ఇంటర్‌ఫేస్ (యూహెచ్‌ఐ)ను భారత ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీని ద్వారా అంబులెన్స్, ఫార్మసీ సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల మాట్లాడుతూ దేశంలో వైద్య ఆరోగ్య రంగంలో అనేక రకాల సంస్థలు ఉన్నప్పటికీ ఇందులో నాణ్యమైన పరిశోధనల కోసం, సంస్థలు, ప్రొఫెషనల్స్‌ను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఐఎస్‌బీ మ్యాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ-ఎంఐహెచ్‌ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సారంగదేవ్‌తోపాటు పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఘనంగా శివోత్సవాలు



మియాపూర్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత వెంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో శ్రీ భవానీ శంకరాలయం త్రయోవింశ శివోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సామూహిక లక్ష కుంకుమార్చన, నిత్యహోమం చేశారు. చుట్టుపక్కల కాలనీల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాలు స్వీకరించారు.

అన్ని వర్గాలకు సముచిత గౌరవం

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సముచిత గౌరవం కల్పిస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ పేరును ఖరారు చేయడంపై ఆయన్ని శుక్రవారం నీలం మధు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ లకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్ వెంకటేష్, నారాబోయిన‌శ్రీనివాస్, సుధాకర్, సురేష్, సతీష్, కుమార్, విష్ణువర్ధన్, శ్రీనివాస్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమీక్ష

కూకట్‌పల్లి: నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న ప్రారంభం కానున్న నూతన సచివాలయానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు. దీనికి సంబంధించి ఈ నెల 13న నిర్వహించనున్న కార్యకర్తల సమావేశంపై చర్చించారు. సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు ఆయన విగ్రహానికి 16వ తేదీన పాలాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, ఎక్కడైనా పెండింగ్ పనులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

దక్షిణ భారతదేశంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ వినియోగం ఎక్కువ

గచ్చిబౌలి: నాణ్యతలో దేశంలోనే నెంబర్ వన్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌గా ర్యాంక్ సాధించిన జెమిని ప్యూర్ ఇట్‌ను రాష్ట్రంలో విడుదల చేస్తున్నట్లు కార్గిల్ ఇంగ్రిడియెంట్స్ దక్షిణాసియా కన్స్యూమర్ బిజినెస్ లీడర్ అవినాష్ త్రిపాఠి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెమినీ ప్యూర్ ఇట్ రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ గురించి వివరాలు వెల్లడించారు. కార్గిల్ ఫుడ్ ఇంగ్రిడియంట్స్ దక్షిణ భారతదేశంలో వంటనూనెల పోర్ట్‌ఫోలియో విస్తరించాలని నిర్ణయించిందన్నారు. దక్షిణ భారతదేశంలో మూడింట రెండొంతుల సన్‌ఫ్లవర్ ఆయిల్ వినియోగం ఎక్కువగా ఉందని, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా వాడుతున్నారని వివరించారు. సన్‌ఫ్లవర్ ఆయిల్‌తో పాటు రిఫైండ్ పామాయిల్, సోయాబీన్, వనస్పతి, వేరుశనగ నూనె, బేకరీ షార్టెనింగ్స్ ఉత్పత్తి చేస్తామని తెలిపారు.



నమూనాను ఆవిష్కరిస్తున్న అవినాష్ త్రిపాఠి, మార్కెట్ అండ్ ఇన్ సైట్స్ లీడర్ సుబిన్ శివన్

'కార్పొరేట్'లకు అనుకూలంగా బడ్జెట్

ఎంసీపీఐయూ నాయకులు


శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

శేరిలింగంపల్లి: బడ్జెట్‌లో జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని సీపీఐయూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్లకు వినతిపత్రాలను అందించింది. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి తుకారంనాయక్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో సామాజిక వర్గాలకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. గతంలో నిరుద్యోగ భృతిని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు దాని గురించి పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగులకు 5వేల రూపాయలు భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు లాసాని రాజు, సభ్యులు రాములు, నర్సింగ్, రవికాంత్, రాములు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


దీకే ఎన్‌క్లేవ్ కాలనీలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని డీకే ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.20.15లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శుక్రవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోఅభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నాయకులు గంగాధర్ రావు, అన్వర్ షరీఫ్, రోజా, సుప్రజ, మల్లేష్, కాలనీ అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షులు రాంబాబు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర, సంస్కృతి విషయంలో జాగ్రత్త వహించాలి

హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: మన చరిత్ర సంస్కృతులను భద్రపర్చుకునే విషయంలో భద్రతాపరమైన సాఫ్ట్‌వేర్లను రూపొందించుకోవాలని హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు సూచించారు. తెలంగాణ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ సహకారంతో కరీంనగర్‌లోని రాజరాజేశ్వరి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో 'భారతీయ సాహిత్యం, సంస్కృతిలో డిజిటల్ హ్యూమానిటీస్ అన్వేషణ, సవాళ్ళు అనే జాతీయ సదస్సులో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగుశాఖ ద్వారా ఆన్‌లైన్‌లో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఇంటర్నెట్‌లో లభ్యమవుతున్న చరిత్ర ,సంస్కృతుల పుస్తకాలు వక్రీకరణకు గురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ .రామకృష్ణ, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, పోగుల విశ్వప్రసాద్, డాక్టర్ కే శారద, సుభాష్‌చంద్రబోస్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సంపద సృష్టికర్తలుగా మారాలి



రాయదుర్గం: విద్యతోనే అభివృద్ధి అని, విద్యార్థులు భారతదేశానికి సంపద సృష్టికర్తలుగా మారాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్: క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీ'పై స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణం కోసం విద్యను అభ్యసించాలన్నారు. సాంకేతికతను ఒక సమస్యగా భావించి వాటికి పరిష్కారాలను కనుగొనడానికి చర్చలు జరపాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ వై నర్సింహులు మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తయారు చేయాలన్నారు. ఈ సదస్సులో ఎన్‌పీటీఈఎల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మంగళ సుందర్‌కృష్ణన్, బెంగళూరు ఆర్‌వి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కెఎన్ సుబ్రమణ్యం, ఎన్‌ఐఈపీఏ న్యూఢిల్లీ ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రసంగించారు.

సీఫుడ్ ఫెస్ట్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్ అయ్యప్పసొసైటీలో శుక్రవారం సీ ఫుడ్‌ఫెస్ట్‌ను బుల్లితెర నటి ఐశ్వర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ఆహార రుచులకు హైదరాబాద్ కేరాఫ్‌గా మారిందన్నారు. నిర్వాహకురాలు శ్రావణి రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ శాఖాహార, మాంసాహార వంటకాలతో పాటు హైదరాబాదీ ఫుడ్ లవర్స్ కోసం సముద్రపు ఆహార వంటకాలను ఈనెల 17వ తేదీ వరకు అందిస్తున్నట్లు తెలిపారు.

ఎఫ్‌ఓబీ నిర్మాణ పనులు పరిశీలన

రాయదుర్గం: ప్రజల సౌకర్యార్థం రాయదుర్గంలోని మల్కంచెరువు సమీపంలో నిర్మించే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు 60 శాతం పూర్తయ్యాయి. శుక్రవారం నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఏఈ జగదీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో రాయదుర్గంలోని సన్‌షైన్ ఆస్పత్రికి వెళ్ళే వారికే కాకుండా ప్రధానంగా చిత్రపురి కాలనీవాసులు, టింబర్‌లేక్ కాలనీ, మల్కంచెరువు వద్దకు వచ్చే వారికి ఉపయుక్తం అని తెలిపారు. ఈ ఎఫ్‌ఓబీకి మెట్లతోపాటు ప్రత్యేకంగా లిఫ్ట్ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.


ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ జగదీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్

మరుగుదొడ్డి వాడకంపై అవగాహన



ఉస్మాన్ నగర్‌లో విద్యార్థుల ర్యాలీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బహిరంగ మలమూత్ర విసర్జనకు అడ్డుకట్ట వేయాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్ నగర్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మరుగుదొడ్డి వాడకంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా విద్యార్థులకు మరుగుదొడ్ల ఉపయోగం గురించి అవగాహన కల్పించామన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు .